## క్లుప్తంగా

### పారిశుధ్య పనుల్లో అలసత్వం తగదు



నెల్లూరు(బారకాసు): నగరంలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనుల్లో అలసత్వం తగదని మేయర్ స్రవంతి ఆదేశించారు. నగరంలోని 4, 46వ డివిజన్లలో గల చిన్నబజార్ పండ్ల మార్కెట్ ప్రాంతాల్లో పారిశుధ్య పనులను కార్పొరేటర్ వేలూరు మహేష్‌తో కలిసి మంగళవారం ఆమె పరిశీలించారు. స్థానికుల సమస్యలను ఆరాతీశారు. అనంతరం 47 / 1, 2, 3 సచివాలయాలను సందర్శించి సిబ్బంది పనితీరు, ప్రభుత్వ పథకాల అమల తీరును పర్యవేక్షించారు.

### డాక్టరేట్ ప్రదానం



సునీల్‌కుమార్

నెల్లూరు (టౌన్): వెంకటాచలం మండలం చవటపాళేనికి చెందిన చెరుకూరు సునీల్‌కుమార్‌కు డాక్టరేట్ లభించింది. జిల్లాలోని గిరిజనుల సామాజిక, ఆర్థిక స్థితిగతులు.. యానాది తెగల అధ్యయనంపై నాగార్జున యూనివర్సిటీ గ్రామీణాభివృద్ధి విభాగంలో ప్రొఫెసర్ దివ్యోతేజోమూర్తి పర్యవేక్షణలో పరిశోధన చేశారు. ఈ క్రమంలో డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. కాగా ఆయనకు వర్సిటీలోని అధ్యాపకులు, పరిశోధకులు తదితరులు అభినందనలను తెలియజేశారు.

### మద్యం అనధికార విక్రయాలపై దాడులు



నెల్లూరు సిటీ: మద్యం అనధికార విక్రయాలపై పలు ప్రాంతాల్లో దాడులను ఎక్సైజ్ అధికారులు మంగళవారం చేపట్టారు. వివరాలు.. టైలర్స్ కాలనీ వద్ద మహబూబ్‌బాషా.. కొత్తకాలువ సెంటర్‌లో కార్తీక్ గుట్టుచప్పుడు కాకుండా మద్యాన్ని విక్రయిస్తున్నారనే సమాచారం ఎక్సైజ్ అధికారులకు అందింది. దీంతో దాడులు చేశారు. మహబూబ్‌బాషా వద్ద 14.. కార్తీక్ వద్ద 15 బాటిళ్లను స్వాధీనం చేసుకొని, వారిపై కేసు నమోదు చేశారు.

### సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



నెల్లూరు(సెంట్రల్): నగరంలోని ఇద్దరికి సీఎం సహాయ నిధి చెక్కులను ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మంగళవారం అందజేశారు. నగరంలోని తన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆపదలో ఉన్న వారిని ప్రభుత్వం ఆదుకుంటోందని చెప్పారు.

### 'కండలేరు' నిరుద్యోగులకు అన్యాయం



డీఆర్వోకు వినతిపత్రమిస్తున్న బీజేపీ నేతలు

నెల్లూరు రూరల్: సోమశిల ముంపు నిరుద్యోగులకు మేలు జరిగేలా.. కండలేరు ముంపు నిరుద్యోగులకు అన్యాయం జరిగేలా జలవనరుల శాఖలో ద్వంద్వ ప్రమాణాలను అమలు చేస్తున్నారని బీజేపీ నేత మిడతల రమేష్ ఆరోపించారు. ఈ మేరకు కలెక్టరేట్లో డీఆర్వో ఉదయభాస్కర్‌కు వినతిపత్రాన్ని మంగళవారం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. కండలేరు ముంపువాసుల్లో నిరుద్యోగ జాబితాకు ప్రభుత్వం ఆమోదం తెలపడంలేదని చెప్పారు. నరాల సుబ్బారెడ్డి, అల్లూరు నాగేంద్రసింగ్, భాస్కర్, సుబ్బయ్య, నరేష్ పాల్గొన్నారు.

### ఆశ కార్యకర్తల సేవలు అభినందనీయం



నెల్లూరు(అర్బన్): గ్రామాలు, కాలనీల్లో వ్యాధులను గుర్తించి వారికి సకాలంలో వైద్యసేవలందేలా కృషి చేస్తున్న ఆశ కార్యకర్తల సేవలను ఏడీఎంహెచ్ఓ ఖాదర్‌వలీ అభినందించారు. ఎన్టీఆర్‌నగర్, రైతుబజార్ రోడ్డు, అల్లీపురం తదితర ప్రాంతాల్లోని అర్బన్ పీహెచ్‌సీల్లో మంగళవారం నిర్వహించిన ఆశ దినోత్సవానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు.

### సూపర్ లగ్జరీ బస్సుల కేటాయింపు

నెల్లూరు సిటీ: నెల్లూరు ఆర్టీసీ రీజియన్‌కు మూడు సూపర్ లగ్జరీ బస్సులను కేటాయించారని ఆర్ఎం మురళీబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అవసరమైన ప్రాంతాలను పరిశీలించి బస్సులను కేటాయించనున్నామని చెప్పారు.

# వీడని వర్షం



కేవీఆర్ పెట్రోల్ బంక్ సెంటర్‌లో జోరుగా కురుస్తున్న వర్షం

నెల్లూరు(బారకాసు): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా ఐదు రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తోంది. తాజాగా మంగళవారం సైతం ఇదే పరిస్థితి నెలకొంది. నగరం జలమయమైంది. చిన్న వీధుల్లో మోకాలి లోతులో నీరు నిలిచింది. శివారు ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కాలువలు పొంగుతున్నాయని.. రోడ్లు మునిగిపోయాయంటూ నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ నంబర్‌కు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు సైతం పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.

**పకడ్బందీగా ఏర్పాట్లు**

నగర ప్రజలు ఎలాంటి ఇబ్బంది పడకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టామని అదనపు కమిషనర్ నందన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వర్షాలు మరో రెండు రోజుల పాటు కురిసే అవకాశం ఉందని, ఎలాంటి పరిస్థితులనైనా సమర్థంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. కాలువలు పొంగి ప్రవహించకుండా చెత్తను తొలగిస్తున్నామని చెప్పారు. కాలనీలు, ఇళ్లలోకి నీరు చేరితే పంపింగ్ చేసేందుకు వీలుగా మోటార్లతో సిబ్బంది సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఏమైనా సమస్యలుంటే హెల్ప్‌లైన్ నంబర్లు 0861 2356777, 2316777కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

# పేదలకు అండగా రెడ్‌క్రాస్ సేవలు



ఆహార పొట్లాలను పంపిణీ చేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు

నెల్లూరు(అర్బన్): వరదలు, విపత్తుల సమయాల్లో పేదలకు అండగా రెడ్‌క్రాస్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కమిటీ నిలుస్తోందని రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. వర్షాలతో కూలీ పనుల్లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న ఇందిరమ్మ కాలనీ, గాంధీగిరిజన సంఘం ప్రాంత వాసులకు ఆహార పొట్లాలు, తాగునీటి ప్యాకెట్లను మంగళవారం పంపిణీ చేశారు. ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులకు ఆహారాన్ని అందజేశారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, కమిటీ సభ్యులు మలిరెడ్డి కోటారెడ్డి, దాసరి రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# దుప్పట్ల అందజేత



వెంకటేశ్వరపురంలో..

నెల్లూరు(వీఆర్సీసెంటర్): దివ్యాంగుల దినోత్సవాన్ని వెంకటేశ్వరపురంలోని జీఆర్ ఆకాడమీ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో దివ్యాంగుల ఐక్యసంఘం, బ్లాక్‌బోర్డు మిత్రమండలి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు దివ్యాంగులకు దుప్పట్లను పంపిణీ చేశారు. దివ్యాంగుల ఐక్యసంఘ జిల్లా అధ్యక్షుడు సనావుల్లా, బ్లాక్‌బోర్డు మిత్రమండలి అధ్యక్షుడు నరసాపురం ప్రసాద్, జీఆర్ అకాడమీ కరస్పాండెంట్ రజియా, శ్రీను, జకావుల్లా, శీనయ్య, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.



ఇరుకళల పరమేశ్వరి దేవస్థాన సమీపంలో..

నెల్లూరు(బృందావనం): నగరంలోని ఇరుకళల పరమేశ్వరి ఆలయం వద్ద పేదలకు దుప్పట్లను పినాకినీ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్‌రాజు మాట్లాడారు. కొండూరు హరినారాయణరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని వీటిని అందజేశామని వివరించారు. నెహ్రూ యువ కేంద్ర జిల్లా అధికారి ఆకుల మహేంద్రరెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### బహుమతుల ప్రదానం



నెల్లూరు సిటీ: ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన, క్రీడా పోటీలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులను అందజేశారు. సమగ్ర శిక్ష ఏపీసీ ఉషారాణి, ఎంఈఓ మురళీధర్, సహిత విద్య కోఆర్డినేటర్ పెంచలయ్య, ఉపాధ్యాయులు కూర్మరావు, శశిధర్ పాల్గొన్నారు.

### ఉత్సాహంగా క్రీడా పోటీలు



నెల్లూరు (టౌన్): ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని దర్గామిట్టలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో క్రీడా పోటీలను రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. బాలభవన్ డైరెక్టర్ సుభద్రాదేవి, హెచ్ఎం కృష్ణారెడ్డి, స్పెషల్ ఎడ్యుకేటర్ ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

### మెట్రో నగరాల అధ్యయనంలో కమిషనర్



నెల్లూరు(బారకాసు): నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో వివిధ అభివృద్ధి పనులను చేపట్టేందుకు గానూ మెట్రో నగరాల అధ్యయనంలో భాగంగా హైదరాబాద్‌లోని వివిధ విభాగాల ఉన్నతాధికారులతో కమిషనర్ సూర్యతేజ మంగళవారం భేటీ అయ్యారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌ను కలిశారు. రహదారులు, పార్కులు, వీధిదీపాలు, భూగర్భ డ్రైనేజీ, ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థ తదితరాలపై చర్చించారు. సూపరింటెండింగ్ ఇంజినీర్ రామ్మోహన్‌రావు, ఈఈ రహంతుజానీ పాల్గొన్నారు.

### పెద్దాస్పత్రిలో అన్నదానం



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని జీజీహెచ్‌లో అన్నదానాన్ని సత్యసాయి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. వివేకానంద వాకర్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ పొన్నం రవిచంద్ర తల్లి భారతమ్మ వర్ధంతిని పురస్కరించుకొని కార్యక్రమాన్ని చేపట్టారు. అసోసియేషన్ కార్యదర్శి స్వర్ణ రమేష్‌బాబు, కోశాధికారి జయదేవ్, వ్యవస్థాపకుడు నరేంద్రరెడ్డి, వాకర్స్ మాజీ గవర్నర్ రాఘవేంద్రశెట్టి, అమరేంద్రరెడ్డి, కేఎమ్కే రెడ్డి, సుబ్బరామిరెడ్డి, ఓబుల్‌రెడ్డి, యల్లారెడ్డి, గోపీనాథ్, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

### జిల్లా స్థాయి శిక్షకులకు ట్రెయినింగ్



నెల్లూరు రూరల్: సమాజ శ్రేయస్సుకు కిశోర బాలికల వికాసం అత్యంత కీలకమని డీఆర్వో ఉదయభాస్కర్‌రావు పేర్కొన్నారు. కిశోర బాలికల వికాస జిల్లా స్థాయి శిక్షకులకు ట్రెయినింగ్ కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ హేనాసుజన్, సమగ్ర శిక్ష ఏపీసీ ఉషారాణి, డీఆర్డీఏ పీడీ నాగరాజకుమారి, డీఎంహెచ్ఓ పెంచలయ్య, డీఈఓ బాలాజీరావు, మెప్మా పీడీ రాధ, సోషల్ వెల్ఫేర్ డీడీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

### లబ్ధిదారులకు గృహాలు మంజూరు చేయండి



మాట్లాడుతున్న నందన్

నెల్లూరు(బారకాసు): అర్హులైన లబ్ధిదారులకు గృహాలను మంజూరు చేయాలని అదనపు కమిషనర్ నందన్ ఆదేశించారు. నగరపాలక సంస్థలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మెప్మా, హౌసింగ్ కార్పొరేషన్, నగరపాలక సంస్థ హౌసింగ్ విభాగాధికారులతో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. టిడ్కో గృహాలను లబ్ధిదారులకు మంజూరు చేసేందుకు గానూ అర్హతలను పునఃపరిశీలించాలని కోరారు. హౌసింగ్ కార్పొరేషన్ ఈఈ దయాకర్ పాల్గొన్నారు.

### దోమతెరల వితరణ



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): బట్వాడిపాళెంలోని ఎస్సీ బాలికల వసతి గృహంలో చదువుతున్న బాలికలకు దోమతెరలు, దుప్పట్లను పంపిణీ చేశారు. సత్య ట్రస్ట్ నిర్వాహకుడు పాకాల శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ ఇన్‌చార్జి డీడీ శ్రీనివాసులు, అసిస్టెంట్ వెల్ఫేర్ అధికారి హజరత్తయ్య, ట్రస్ట్ నిర్వాహక సభ్యులు హేమలత, విజయ్‌కుమార్, ఉమా, కృష్ణ చైతన్య, హాస్టల్ వెల్ఫేర్ అధికారి సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

### సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

నెల్లూరు(సెంట్రల్): అందరి సహకారంతో నెల్లూరు రూరల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయనున్నామని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. 30వ డివిజన్లో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపనను మంగళవారం ఆయన నిర్వహించారు.

### పక్కాగా తల్లిదండ్రులు, టీచర్ల సమావేశాలు



మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు రూరల్: పేరెంట్స్ – టీచర్ల సమావేశాలను ఈ నెల ఏడున పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. నెల్లూరులోని కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. తల్లిదండ్రులు తప్పనిసరిగా హాజరయ్యేలా చూడాలని కోరారు. పూర్వ విద్యార్థులు, ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని చెప్పారు. ఏర్పాట్లను గురువారం నాటికి పూర్తి చేయాలని సూచించారు. డీఈఓ బాలాజీరావు, డీఆర్వో ఉదయభాస్కర్‌రావు, సోషల్ వెల్ఫేర్ డీడీ శ్రీనివాసులు, డీఆర్డీఏ పీడీ నాగరాజకుమారి, సీఈఓ విద్యారమ, ఆర్ఐఓ శ్రీనివాసులు, డీపీఓ శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### క్రీడా పోటీల్లో పోలీసుల ప్రతిభ



నెల్లూరు సిటీ: క్రీడా పోటీల్లో ప్రతిభ చూపిన పోలీసులను ఎస్పీ కృష్ణకాంత్ అభినందించారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. శ్రీనగర్‌లో సెకండ్ ఆలిండియా పెన్‌కాక్ సిలాట్ చాంపియన్‌షిప్‌ను నవంబర్ 19 నుంచి 21 వరకు నిర్వహించారు. ఇందులో చరణ్‌తేజ ద్వితీయ, రాజశేఖర్ తృతీయ బహుమతులను సాధించారు. అదే విధంగా 25వ ఆలిండియా పోలీస్ బ్యాండ్ మీట్‌ను గత నెల 16 నుంచి 22 వరకు నాగాలాండ్‌లో నిర్వహించారు. ఇందులో కానిస్టేబుల్ పుల్లయ్య ఆంధ్రప్రదేశ్ స్టేట్ పోలీస్ బిగిల్ టీమ్‌తో కలిసి కాంస్య పతకాన్ని సాధించారు. దీంతో వీరిని ఎస్పీ అభినందించారు.

### హెచ్‌డీఎస్ కోఆర్డినేటర్‌గా శ్రీనివాసులు



నెల్లూరు(అర్బన్): నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి అభివృద్ధి సొసైటీ కమిటీ కో ఆర్డినేటర్‌గా వావిలేటిపాడుకు చెందిన మడపర్తి శ్రీనివాసులు నియమితులయ్యారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులుగా వీరబ్రహ్మారెడ్డి, శ్రీనివాసులు, ఆబీదా సుల్తానా, మల్లికార్జున, మొగరాల సురేష్‌ను కలెక్టర్ సోమవారం ఆమోదించిన విషయం విదితమే. ఈ క్రమంలో మడపర్తి శ్రీనివాసులును కో ఆర్డినేటర్‌గా నియమించారు. కాగా మిగిలిన కమిటీ సభ్యులతో కలిసి పెద్దాస్పత్రిలో బాధ్యతలను ఈ నెల 13న ఆయన స్వీకరించనున్నారు.

### అనుమతులను తప్పక పొందాలి

నెల్లూరు(సెంట్రల్): జిల్లాలో ఆక్వా వ్యాపారం చేస్తున్న ప్రతి ఒక్కరూ ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ నుంచి అనుమతులను తప్పక పొందాలని సంస్థ కో వైస్ చైర్మన్ ఆనం వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. నగరంలోని మత్స్యశాఖ కార్యాలయంలో సమీక్ష సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. మత్స్యశాఖ జిల్లా అధికారి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

### రైతులను ఆదుకోవాలని వినతి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): భారీ వర్షాలతో నష్టపోయిన రైతులు, చేనేత కార్మికులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని డీసీసీ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలో వేలాది ఎకరాల్లో పంట నష్టం జరిగిందని, అంచనా వేసి పరిహారాన్ని అందించాలని చెప్పారు. పనుల్లేక వ్యవసాయ, చేనేత కార్మికులు ఇబ్బంది పడుతున్నారని, వీరికి 25 కిలోల బియ్యం నిత్యావసర సరుకులను అందజేయాలని డిమాండ్ చేశారు.

# ఉజ్వల భవిష్యత్తుకు ఇష్టంతో చదవాలి



యండమూరి వీరేంద్రనాథ్‌ను సత్కరిస్తున్న వీఎస్‌యూ వీసీ, జేసీ తదితరులు

నెల్లూరు(బృందావనం): విద్యార్థులు ఇష్టంగా చదివి తమ లక్ష్యాలను చేరుకోవాలని ప్రముఖ రచయిత, వ్యక్తిత్వ వికాస నిపుణుడు యండమూరి వీరేంద్రనాథ్ పేర్కొన్నారు. నగరంలోని పురమందిరంలో విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమాన్ని వినోద్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మనపాటి చక్రవర్తి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన యండమూరి మాట్లాడారు. జీవితానికి చదువుతో పాటు శారీరక, మానసికారోగ్యం ఎంతో అవసరమనే విషయాన్ని విద్యార్థులు గుర్తించాలని కోరారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు సంధించి వారి నుంచి సమాధానాలను రాబట్టి బహుమతులను అందజేశారు. అనంతరం యండమూరిని సత్కరించారు. సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. చదువు ప్రాధాన్యాన్ని వివరిస్తూ గీతాన్ని అళహరి వెంకటేష్ ఆలపించారు. వీఎస్‌యూ వీసీ విజయభాస్కర్‌రావు, ఐఆర్ఎస్ అధికారి శైలేంద్రబాబు, జేసీ కార్తీక్, డాక్టర్ సుధీర్, శేఖర్‌బాబు, వినోద్ ఫౌండేషన్ సభ్యులు రాజు, అనిల్, మున్నా, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

### పొట్టేపాళెం వాగులో ఆటో బోల్తా



నెల్లూరు సిటీ: పొట్టేపాళెం వాగులో ఆటో బోల్తాపడిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు.. నెల్లూరు నుంచి బుచ్చిరెడ్డిపాళేనికి ఆటో బయల్దేరింది. ఇదే సమయంలో భారీ వర్షాలతో పొట్టేపాళెం కలుజు వాగులో నీటి ఉధృతి ఎక్కువైంది. ఈ తరుణంలో ఆటో ప్రమాదవశాత్తు బోల్తాపడింది. ప్రమాదంలో డ్రైవర్ అక్బర్, మరో ముగ్గురు గాయపడ్డారు. క్షతగాత్రులను బుచ్చిరెడ్డిపాళెంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

### రాహుకాల దీపారాధన



నెల్లూరు(బృందావనం): నగరంలోని ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో రాహుకాల దీపారాధనను భక్తిశ్రద్ధలతో మంగళవారం నిర్వహించారు. ఈఓ విరుపాపరుపుల గిరికృష్ణ, కార్పొరేటర్ విజయలక్ష్మి, దేవస్థాన ఉత్సవ కమిటీ చైర్మన్ ఒట్టూరు సురేంద్ర, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సతీమణి సుజిత తదితరులు పాల్గొన్నారు.

### అట్రాసిటీ కేసు నమోదు

నెల్లూరు సిటీ: కులం పేరుతో దూషించడంతో పాటు బాటిల్‌తో తలపై దాడి చేశారంటూ దర్గామిట్ట పోలీసులకు బాధితుడు మంగళవారం ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. బురాన్‌పూర్‌కు చెందిన చెంచురెడ్డి వద్ద కారు డ్రైవర్‌గా కలివెలపాళేనికి చెందిన నవీన్ పనిచేస్తున్నారు. ఈ క్రమంలో చెంచురెడ్డిని కారులో పోస్టల్ కాలనీలోని చైతన్య ఇంటికి నవీన్ తీసుకెళ్లారు. ఈ తరుణంలో చెంచురెడ్డి, చైతన్య వాగ్వాదానికి దిగారు. కారు దిగి చైతన్య ఇంట్లోకి నవీన్ వెళ్లగా, కులం పేరుతో ఆయన దూషించారు. బాటిల్‌తో తలపై దాడి చేయడంతో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### పక్కాగా ఫైలేరియా పరీక్షలు



నెల్లూరు(అర్బన్): ఫైలేరియాను నివారించేందుకు గానూ రక్త నమూనాలను సేకరించి రక్త పరీక్షలను పక్కాగా చేపట్టాలని డీఎంహెచ్ఓ పెంచలయ్య ఆదేశించారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల పరిధిలో పనిచేస్తున్న 115 మంది ల్యాబ్ టెక్నీషియన్లకు శిక్షణ కార్యక్రమాన్ని నగరంలోని వైద్యశాఖ కార్యాలయంలో జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ముందస్తు సర్వేను ఈ నెల తొమ్మిది వరకు నిర్వహించి.. రాత్రి ఎనిమిది నుంచి పది గంటల్లోపు 20 ఏళ్ల పైబడిన వారి రక్త నమూనాలను సేకరించాలని చెప్పారు. ఏడీఎంహెచ్ఓ ఖాదర్‌వలీ, మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ, సహాయ మలేరియా నివారణాధికారి నాగార్జునరావు పాల్గొన్నారు.

### షేడ్‌నెట్ నిర్మాణానికి ప్రోత్సాహకాలు

నెల్లూరు (సెంట్రల్): జిల్లాలోని రైతులకు ఉద్యాన శాఖ ద్వారా రక్షిత వ్యవసాయం పథకం కింద షేడ్‌నెట్, పాలీహౌస్‌ల నిర్మాణానికి ప్రోత్సాహకాలను కల్పిస్తున్నామని ఉద్యానాధికారి సుబ్బారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివరాలకు 79950 86780 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

### జేసీని కలిసిన ఎమ్మెల్యే

నెల్లూరు(అర్బన్): జేసీ కార్తీక్‌ను కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మంగళవారం కలిశారు. నియోజకవర్గంలోని రెవెన్యూ సమస్యలను తెలియజేసి పరిష్కరించాలని ఆయన కోరారు.

### రోడ్లపై పశువులను వదిలితే చర్యలు



నెల్లూరు(బారకాసు): వాహనాల రాకపోకలకు అడ్డంకిగా మారిన పశువులపై యజమానులు బాధ్యత వహించకపోతే కఠిన చర్యలు తప్పవని, వాటిని గోశాలకు తరలిస్తామని నగరపాలక సంస్థ వెటర్నరీ వైద్యాధికారి మదన్‌మోహన్ పేర్కొన్నారు. ముత్తుకూరు రోడ్డు, ధనలక్ష్మీపురం, మద్రాస్ బస్టాండ్, బీవీనగర్ ప్రాంతాల్లో సంచరిస్తున్న ఆరు గోవులను కల్లూరుపల్లిలోని గోశాలకు మంగళవారం తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రోడ్లపై సంచరించే పశువులను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. పశువులను గోశాలకు తరలించి వాటి సంరక్షణ బాధ్యతను నగరపాలక సంస్థ పర్యవేక్షిస్తుందని తెలిపారు.

### ఇన్సురెన్స్‌పై న్యాయవాదులకు అవగాహన



నెల్లూరు (లీగల్): ఇన్సురెన్స్‌పై న్యాయవాదులకు అవగాహన కార్యక్రమాన్ని ఏపీ బార్ కౌన్సిల్, నేషనల్ ఇన్సురెన్స్ కంపెనీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. నెల్లూరు బార్ అసోసియేషన్ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి, అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుందరయ్య, మాజీ కార్యదర్శి రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### దివ్యాంగులకు సమానావకాశాలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఆనం అరుణమ్మ

నెల్లూరు(పొగతోట): దివ్యాంగులు అందరితో సమానంగా.. గౌరవంగా జీవించేందుకు అవకాశాలు కల్పించాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పేర్కొన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పుర స్కరించుకొని నగరంలోని జెడ్పీ సమావేశ మందిరంలో కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వాణి, విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఇన్‌చార్జి సహాయ సంచాలకుడు వినీల్ కుమార్ పాల్గొన్నారు.

### 'డీకేడబ్ల్యూ'లో పుస్తకావిష్కరణ



నెల్లూరు (టౌన్): యాభై మూడు మంది రచయిత్రులు రాసిన యోధ పుస్తకాన్ని నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం రచయిత్రులు మాట్లాడారు. సవాళ్లను ఎదుర్కొని ధైర్యంగా నిలబడిన యోధుల జీవిత చిత్రీకరణలే ఈ కథలని చెప్పారు. ప్రిన్సిపల్ గిరి, రచయిత్రులు సుహాసిని, కరుణశ్రీ, అన్నపూర్ణ, విజయ, హైమావతి, విజయలక్ష్మి, వినయ పాల్గొన్నారు.